

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

29 ఏప్రిల్ 2025 పేజీలు : 10


## అల్లుకున్న నిర్లక్ష్యం !



**వింజమూరు, మేజర్‌న్యూస్ :**

వింజమూరు పంచాయతీ పరిధిలోని జీబీకేఆర్ ఎస్టీ కాల నీ సమీపం వద్ద గల వంతెన దగ్గర ఉన్న విద్యుత్ స్తంభాలకు పిచ్చి తీగలు అల్లుకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగజేస్తున్నాయి. అయితే ట్రాన్స్‌కో అధికారులు మాత్రం దీనిని పట్టించుకోకుండా వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ తీగల వల్ల అప్పుడప్పుడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయా పరిధిలోని ప్రజలు తెలియజేస్తున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు తెలియజేసినప్పుడు మాత్రం అలా వచ్చి.. ఇలా పరిశీలించి వెళ్తున్నారే తప్ప.. చర్యలు ఏమాత్రం తీసుకోవడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఈ తీగలను తొలగిస్తే నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- మన్నేటిగుంటలో సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ
- హాజరైన మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి
- సబ్ స్టేషన్ నిర్మాణం రైతులకు ఎంతో ఉపయోగం
- చుట్టుపక్కల ప్రాంతాల్లో.. లో-ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం

## విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ఉలవపాడు మండలంలోని మన్నేటికోట పంచాయతీలో సోమవారం 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో మాట్లాడారు. త్వరిత గతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ... నిరంతర త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాతో మన్నేటికోట పరిసర ప్రాంతాల్లో ఇకపై అర్ధాంతరంగా పవర్ ట్రిప్ కావడం, లోవోల్టేజ్ కారణంగా మోటార్లు కాలిపోయి రైతులు నష్టపోయే పరిస్థితులు తలెత్తవన్నారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గుంతల రహిత రోడ్ల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. సాంప్రదాయ విద్యుత్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా ప్రతి ఇంట్లో సోలార్ పవర్ వినియోగించి పెంచాలన్న ఉద్దేశంతో కేంద్రం పీఎం సూర్యఘర్ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు సోలార్ యూనిట్లకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 60 వేల సబ్సిడీతో పాటు రాష్ట్రం

-2లో

### సంతపేట మార్కెట్‌ను

## పరిశుభ్రంగా ఉంచండి



నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని సంతపేట మార్కెట్ ప్రాంగణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు.

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

లోపల పేజీలో

## రోడ్డుకు గండి.. పూడ్చేదెప్పుడో తెలీదండి !



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :**

నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం.. రోజుకు కొన్ని వందల వాహనాలు ప్రయాణించే రోడ్డు అది. ఆ రోడ్డుకు గండి పడి సుమారు 15 రోజులు గడుస్తున్నా.. ఇంతవరకు అధికారులు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. వివరాల్లోకి వెళితే.. తోటపల్లి గూడూరు మండల పరిధిలోని వరిగొండ - తోటపల్లి గూడూరు మధ్యలో కల్వర్టు వద్ద రోడ్డుకి గండి పడింది. ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ రోడ్డు మార్గం అత్యంత ప్రమాదకరంగా మారింది. అయినా కూడా అధికారులు

-మిగతా 2లో

### దివ్యాంగులను

## ఎంపీ వేమిరెడ్డి ఆసరా

### మరో ఆరుగురికి ట్రై సైకిళ్ల అందజేత

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



నెల్లూరు జిల్లావ్యాప్తంగా వందలాది మంది దివ్యాంగులను ఆదుకుంటున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. మరో 6 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించి ఆదుకున్నారు. సోమవారం నెల్లూరులోని ఆయన నివాసంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. నడవలేక అవస్థలు పడే ఏ ఒక్క దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందకుండా ఉండకూడదన్నది ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లక్ష్యం. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కోవూరు, కావలి నియోజకవర్గాల వ్యాప్తంగా ట్రై సైకిళ్లు అందిస్తున్నారు. అనివార్య కారణాలతో ట్రై సైకిళ్ళు అందుకోలేకపోయిన కావలి పట్టణంలోని బుడంగుంట, అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు, సోమశిల, సంగం మండలం తరుణవాయి గ్రామాలకు చెందిన 6 మంది దివ్యాంగులు నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని వీపీఆర్ నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ళు అందుకున్నారు. ట్రై సైకిళ్ళు అందుకున్న దివ్యాంగులు ఎంపీ వేమిరెడ్డి దాతృత్వం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

# సంతపేట మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచండి

## కమిషనర్ నందన్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని సంతపేట మార్కెట్ ప్రాంగణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ సోమవారం సంతపేట, రైల్వే ఫీడర్స్ రోడ్, అనంతరం 12వ డివిజన్ చింతారెడ్డి పాలెం పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన డ్రైను కాలువల పూడిక తీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో డ్రైను కాలువల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. రైల్వే ఫీడర్స్ రోడ్డు ప్రాంతంలో గోడలపై అంటించిన పోస్టర్లను వెంటనే తొలగించి గోడలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యుత్ వీధి దీపాలు అన్ని డివిజన్లలో రాత్రి వేళల్లో వెలిగేలా, పగటివేళ్లలో ఆపివేసేలా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అదేవిధంగా నగరవ్యాప్తంగా ప్రణాళికాబద్ధమైన పారిశుద్ధ్య నిర్వహణకు, దోమల నిర్మూలనకు ప్రతిష్టాత్మక చేపట్టిన భూగర్భ డ్రైను వ్యవస్థలో అన్ని గృహాలను అనుసంధానం చేసి, పరిశుభ్రమైన నగరంలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరు తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు,



సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

*(మొదటి పేజీ తరువాయి)*

మరో 20 వేలు ఇస్తుం దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలు సద్వినియోగం చేసుకొని ప్రజలు సోలార్ విద్యుత్ వినియోగం వైపు మొగ్గు చూపాల న్నారు. త్వరలోనే సబ్ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగం లోకి తీసుకురావాలని అధికారుల ను ఆదేశించారు. భూమిపూజ అనంతరం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సబ్ స్టేషన్ పూర్తయితే సమీపంలో ఉన్న నాలుగు గ్రామాలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని చెప్పారు. గ్రామాలకు నిరవధిక విద్యుత్ సరఫరా లభిస్తుందని, ఇది రైతులకు ఎంతగానో ఉపయోగమని పేర్కొన్నారు. అలాగే కేవలం రైతులకు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయంగా మారుతుందన్నారు. గత ప్రభుత్వం అనేక తప్పులు చేసిందని, వాటికి త్వరలోనే తగిన శాస్తి తప్పదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని వెల్లడించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కందుకూరు నియోజకవర్గంలో 4 సబ్ స్టేషన్‌కు అనుమతులు లభించాయని, వాటిలో మొదటి విడతగా ఉలవపాడు మండలం మన్నేటికోట గ్రామంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. మిగిలిన 3 సబ్ స్టేషన్‌లో కూడా త్వరలో శంకుస్థాపన కార్యక్రమాన్ని



నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. మన్నేటికోట ప్రాంతంలో ఎక్కువ రైతులు మామిడి, సపోటా తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారికి గతంలో విద్యుత్ లో-వోల్టేజ్ సమస్యతో బాధపడుతున్నారని, ఈ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సబ్ స్టేషన్ మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీవో శ్రీపూజ తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ నిఘా నీడలో నెల్లూరు

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సూచనల మేరకు సంబంధిత డీఎస్పీల ఆధ్వర్యంలో ఆయా సీఐ, ఎస్ఐల సమక్షంలో డ్రోన్‌తో నెల్లూరు పట్టణ, శివారు, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో క్షుణ్ణంగా పరిశీలించి, పట్టణ సమీప ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకట్టు వేస్తున్నారు నెల్లూరు పోలీసులు. నెల్లూరు జిల్లాలోని శివారు ప్రాంతాలలో నేరాలకు చెక్ పెడుతూ, జల్లెడ పడుతున్నారు. అందులో భాగంగా సోమవారం ఓపెన్ డ్రింకింగ్‌పై ఉక్కుపాదం మోపుతూ.. కేసులు నమోదు చేశారు. గ్యాంబ్లింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా.. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లను గుర్తిస్తున్నారు. నేర నియంతరనే లక్ష్యంగా క్రైమ్ ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలతో



నేరాలు జరగకుండా తగిన చర్యలు చేపడుతున్నారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిశితమైన ప్రదేశాలను ముందుగా గుర్తించి, పాడుపడిపోయిన బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, నదీ తీరాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేశారు. కావున ఎవరైన చట్ట వ్యతిరేక, క్రిమినల్ చర్యలకు పాల్పడితే చట్ట

నిరంతరం నిఘా పెట్టారు. క్రైమ్ ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు,



ప్రకారం చర్యలు తీసుకుంటామని, గంజాయి సేవించడం, అమ్మడం, రవాణా చేసే వారు పట్టుబడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఇకపై సాంకేతికతతో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నేరాల నియంత్రించుటకు పోలీసులు వినూత్న చర్యలు తీసుకుంటున్నారు.

## రోడ్డుకు గండి.. పూడ్చేదెపుడో తెలీదండి !

*(మొదటి పేజీ తరువాయి)*

ఎవరూ స్పందించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టును పూర్తి చేసి గండిని పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

## త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 115 ఫిర్యాదులు వచ్చాయి. అందులో కొన్నిలా.. కావలి వన్ టౌన్ పరిధికి చెందిన వ్యక్తిని, హైదరాబాదుకు చెందిన స్పందన అనే మహిళ సాఫ్ట్వేర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి, 4.75 లక్షలు నగదు తీసుకొని, నకిలీ ధ్రువీకరణ పత్రాలు అందించి మోసం చేశారని, విచారించి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా ఇందుకూరుపేట పరిధి ఒక మహిళ మరొక ఆరు మందిని, అదే ప్రాంతానికి చెందిన పెనుబర్తి సురేష్ అతని భార్య ఓ బ్లడ్ బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పి, ఓ హాస్పిటల్లో కంప్యూటర్ ఆపరేటర్, సూపర్వైజర్, నర్స్, అసిస్టెంట్లుగా ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి, మా అందరి వద్ద కలిపి 13 లక్షలు నగదు తీసుకున్నారని, ఒక సంవత్సరం నుండి ఉద్యోగం ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు. వెంకటాచలం పరిధికి చెందిన వ్యక్తి యొక్క తల్లిదండ్రులు అనుమానాస్పదంగా మరణించారని, కేసు నమోదు చేసి ఉన్నారని, లోతైన దర్యాప్తు జరిపి వారి మరణానికి కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జలదంకి పరిధికి చెందిన వ్యక్తి యొక్క భార్య ఈనెల 16న ఇంటి నుండి వెళ్లిపోయినట్లు, తనకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారని, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. అదేవిధంగా దర్గామిట్ట పరిధికి చెందిన వ్యక్తి యొక్క తల్లి ఈనెల 6వ తేదీ నుండి కనిపించడం లేదని, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. నవాబ్ పేట పరిధికి చెందిన భర్త చనిపోయిన ఒంటరి వృద్ధురాలిని, తన పెద్దఅల్లుడు, చిన్న కూతురు తనకు జీవనాధారమైన ఇంటి కాగితాలు వాళ్ళు తీసుకొని, అడిగితే మానసికంగా వేధిస్తున్నారని, అదేవిధంగా వింజమూరు పరిధికి చెందిన వృద్ధుని భార్య 5 సంవత్సరాల క్రితం చనిపోయినట్లు, పెద్ద కొడుకు శ్రీను, కోడలు ఇంటి నుండి బయటకు గెంటి వేసి, తన పేరు మీద ఉన్న ఇంటిని తనకు తెలియకనే వాళ్ల పేరు మీదకి మార్చుకొని, లోన్ తీసుకొని తనకు జీవనోపాధి లేకుండా చేశారని, విచారించి న్యాయం చేయాలని కోరారు. వేదాయపాలెం పరిధికి చెందిన వ్యక్తిని, పోలీస్ కాలనీకి చెందిన నాగరాజు అనే అతను కొత్తూరు ఎన్జీవో కాలనీలో రెండు ప్లాట్లు ఇప్పిస్తానని 4 లక్షలు తీసుకొని నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించి మాకు ఇచ్చాడని, మమ్మల్ని మోసం చేసిన నాగరాజుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. బాలాజీ నగర్ పరిధికి చెందిన మహిళ యొక్క క్రెడిట్ కార్డును ఎవరో హ్యాక్ చేసి 70 వేల నగదు కాజేసారని, సైబర్ మోసం జరిగిందని విచారించి న్యాయం చేయాలని కోరారు. కావలి రూరల్ పరిధికి చెందిన మహిళను, తన భర్త ప్రతిరోజు తాగి వచ్చి తన పిల్లల్ని తనని పట్టించుకోకుండా బెదిరిస్తూ, వేధిస్తున్నాడని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిధర్, ఉమెన్ పీఎస్ డీఎస్పీ చెంచు రామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీ శ్రీనివాసులు రెడ్డి, ఎస్బీ-2 సీఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గత సంవత్సరంలో 157 అత్యవసర పరిస్థితుల్లో కీలక సేవలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అత్యవసర పరిస్థితుల్లో 157 కీలకమైన సేవలు అందించామని ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ తెలియజేసింది. ఇక్కడ జరుగుతున్న జరుగుతున్న జాతీయ అగ్నిమాపక సేవా పక్షోత్సవాలు చివరి రోజు అనగా సోమవారం నాటికి ముగిసినాయి. చివరి రోజు అట్టహాసంగా జాతీయ అగ్నిమాపక సేవా పక్షోత్సవాలను ముగించినారు. ఈనెల 14వ తేదీ నుండి చివరి రోజు వరకు ఉద్యోగస్తులు కొరకు అగ్నిమాపక భద్రతా అవగాహన కార్యక్రమాలు తోపాటు పోటీలు నిర్వహణ సాగింది. ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ అగ్నిమాపక దళం వివిధ అగ్నిమాపక మాక్-డ్రిల్‌లతో కార్యక్రమాలు ప్రదర్శించింది. సమాజానికి అత్యవసర సేవలు అందించడంలో తన నిబద్ధతను చాటుకుంటూ అగ్నిమాపక సేవలను తెలియజేసింది. ముత్తుకూరు, టీపీ గూడూరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో సేవలు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రాజెక్టు సిఈఓ రాఘవ్ త్రివేది మాట్లాడారు. ప్రాజెక్టు అగ్నిమాపక దళం యొక్క శక్తి, సామర్థ్యాలు పట్ల విశ్వాసం చూపుతూ ఈ కార్యక్రమాలు చేయడంచాలా అభినందనీయమన్నారు. అగ్నిప్రమాదాలు నివారణ జరిగినప్పుడు ప్రాజెక్టులు పురోగతి సాధిస్తాయని ఆయన అన్నారు. అనంతరం ప్రాజెక్టు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ హెడ్ సునీల్ కుమార్ గుప్తా



మాట్లాడారు. అత్యవసర సమయంలో అగ్నిమాపకదళం ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. అగ్నిమాపక అత్యవసర సమయంలో 7 అగ్ని ప్రమాదాలు, 13 ప్రసవాలు, 17 రోడ్డు ప్రమాదాలు, 120 ఇతర తీవ్రమైన అత్యవసర సేవలు మొబైల్ సమాచారం ద్వారా చేశామన్నారు. మనిషి ప్రాణం కాపాడుతూ విలువైన ఆస్తులు సంరక్షించామన్నారు. తదుపరి వివిధ పోటీల విజేతలకు ఆయన అవార్డులు, బహుమతులను ప్రదానం చేశారు.

# డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని స్థానిక శ్రామిక నగర్‌లో డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా సర్వేపల్లి జనసేన నాయకులు నారదాసు. రవి ఆధ్వర్యంలో మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా సర్వేపల్లి జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎంతోమంది పెద ప్రజలకు సేవ చేసిన వ్యక్తి డొక్కా. సీత్తమ్మ అని కొనియాడారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తరువాత విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కూడా ఆమె పేరు పెట్టడం చాలా సంతోషం కరమన్నారు. డిప్యూటీ సీఎం కొనిదెల పవన్ కళ్యాణ్ ఆలోచన మేరకు అయన ఆశయాల కోసం సర్వేపల్లి నియోజకవర్గ జనసేన నాయకులు పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మల ప్రసాద్, బండి మనోజ్ కుమార్, యనమల మధు, కిరణ్, దినేష్, భాస్కర్, భార్గవ్, జనసైనికులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన కారు.. పలువురికి గాయాలు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబై జాతీయ రహదారిపై మర్రిపాడు మండలం నందవరం చెరువు కట్ట వద్ద సోమవారం ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు వైపు నుండి బద్వేల్ వైపుకు వెళుతూ ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ పహారి గోడను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న



ఐదుగురిలో ఒకరికి గాయాలు కాగా, కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. సమాచారం అందుకున్న మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావు ఆయన సిబ్బందితో ఘటన స్థలానికి చేసుకొని గాయపడిన క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ప్రమాద సమయంలో వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న వాటర్ ప్లాంట్ వద్ద ఎప్పుడు రద్దీగా ఉండే జనం ప్రమాద సమయంలో ఎవరు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడికి పరామర్శ

- పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయం
- పారిశుద్ధ్య కార్మికులకు చైర్ పర్సన్ భరోసా
- ఒక్కొక్కరికి 25 వేలచొప్పున ఆర్థిక సాయం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. ఈమేరకు నగర చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి, నగర కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ రాచూరిసత్యం గాయపడిన దసయ్య, యాదగిరిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. నగర పంచాయతీ తరపున వారికి చెరో రూ.25వేల చొప్పున ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర పంచాయతీకి పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వారు కష్టకాలంలో ఉంటే ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్యం పూర్తిగా కోలుకునేంత వరకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## ఎన్ఎంయు కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం నుంచి రిలే దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలను అసోసియేషన్ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలన్నారు. జోనల్ నాయకులు సలాం డిపో అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్యారేజీ సమస్యల పరిష్కరించాలని మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. గ్యారేజీ సమస్యలు పరిష్కరించాలని ప్రమోషన్లు ఇవ్వాలని ఖాళీల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, శ్రీధర్, వికె మూర్తి, బాష, కేఎం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ సేవలు అభినందనీయం

- నెల్లూరు దర్గామిట్ట ప్రగతి నగర్‌లో సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు
- లాంఛనంగా ప్రారంభించిన ఫోర్త్ టౌన్ సీఐ రోశయ్య
- 800 మందికి పైగా వాహన చోదకులకు పాదాచారులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ
- రవీంద్ర రెడ్డి - జ్యోతి కుమార్తె ఏకోళ్ళ శిల్పా జ్ఞాపకార్థం చలివేంద్రం ప్రారంభం
- సొసైటీ వ్యవస్థాపకులు రమేష్ రాజ్ మిత్రబృందాన్ని అభినందించిన సిఐ రోశయ్య



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని నెల్లూరు ఫోర్త్ టౌన్ సీఐ రోశయ్య అభినందించారు. అదేవిధంగా నెల్లూరు దర్గామిట్ట, ప్రగతి నగర్ మెయిన్ రోడ్డులో పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకులు కోగిలి రమేష్ రాజ్, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో రవీంద్ర రెడ్డి - జ్యోతి కుమార్తె ఏకోళ్ళ శిల్ప జ్ఞాపకార్థం మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన నెల్లూరు ఫోర్త్ టౌన్ సీఐ రోశయ్య చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సుమారు 800 మందికి పైగా వాహన చోదకులకు, పాదాచారులకు మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు ఫోర్త్ టౌన్ సీఐ రోశయ్య గారు మాట్లాడుతూ.. పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని ప్రశంసించారు. యువత సన్మార్గంలో నడిచేలా సొసైటీ వ్యవస్థాపకులు కోగిలి రమేష్ రాజ్ నేతృత్వంలో వారి మిత్రబృందం సామాజిక సేవలు నిర్వహించడం అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఈ క్రమంలో వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రగతి నగర్ మెయిన్ రోడ్డులో సౌకర్యవంతంగా మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకులు రమేష్ రాజ్, వారి మిత్ర బృందాన్ని సిఐ అభినందించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేసుకోవాలని సీఐ సూచించారు. అనంతరం పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ వ్యవస్థాపకులు రమేష్ రాజ్, అధ్యక్షులు వెంకట ముని సూర్య




మాట్లాడుతూ.. సొసైటీ సభ్యులు దాతల సహకారంతో పలు సేవా కార్యక్రమాలను స్ఫూర్తిదాయకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో వేసవి కాలంలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు రవీంద్ర రెడ్డి - జ్యోతి కుమార్తె ఏకోళ్ళ శిల్పా జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని వారి సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలం పూర్తయ్యేంతవరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా పట్టణంలోని మరికొన్ని ప్రాంతాల్లో పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ద్వారా చలివేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. తమకు సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఉపాధ్యక్షుడు సుధాకర్, సభ్యులు సురేష్, యశ్వంత్, ధనలక్ష్మి, బాలాజీ, సతీష్, సాయి, అనిల్, సాయి తేజ, రమేష్, కొండారెడ్డి, ప్రకాష్, హర్ష ప్రియా, మధు, ప్రశాంత్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు

'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ యాప్‌ను

# ప్రజలంతా సద్వినియోగం చేసుకోండి : కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ యాప్ ద్వారా మున్సిపల్ సేవలను సులభతరంగా అందుకోవచ్చని, యాప్‌ను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వై.ఓ. నందన్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్ల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న స్థానిక సమస్యలకు నిర్దేశించిన గడువులోపు పరిష్కారం అందించాలని అధికారులను కమిషనర్ వై.ఓ. నందన్ ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో గృహాల లబ్ధిదారులకు వివిధ కారణాలతో బ్యాంకుల నుంచి రుణాలు అందలేదని, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఇంకా పూర్తికాని నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. పురమిత్ర యాప్ ద్వారా స్థానిక సమస్యలను అప్లోడ్ చేసి సంబంధిత విభాగం ద్వారా సమస్యలకు పరిష్కారం పొందగలరని కమిషనర్ తెలిపారు. ప్రజలంతా తమ ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, కేవలం ఫోన్ ద్వారానే మున్సిపల్ సేవలను, సమస్యలకు పరిష్కారాలను పొందవచ్చని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రోడ్ల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి, మార్ట్‌గేజ్ విడుదల గురించి అర్జీలు అందుకున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంభందించి రోడ్లు, డ్రైను కాలువల నిర్మాణం, సివిల్ వర్కులు, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలను అందుకున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-5, హౌసింగ్-25, టౌన్ ప్లానింగ్-4, రెవెన్యూ-3, పబ్లిక్ హెల్త్-1, అప్సాస్-9, అకౌంట్ సెక్షన్-3, అడ్మినిస్ట్రేషన్-3, మొత్తం-53 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రఘురామ కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలపై ర్యాలీ




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఉండి నియోజకవర్గంలో పేదోళ్ల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చివేయడం, నష్టపరిహారం ఇవ్వకుండా పునరావాసం కల్పించకుండా చేయడం అన్యాయమని ప్రశ్నించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసి అహంకార పూరితగా ధోరణితో మాట్లాడిన ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజు వైఖరిని ఖండిస్తూ సోమవారం సీపీఎం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ సీపీఎం జిల్లా కార్యాలయం నుండి అన్నపూర్ణ అపార్ట్మెంట్ మీదుగా మినీ బైపాస్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పేదోళ్ల ఇల్లు కూల్చడం అన్యాయమని, నష్టపరిహారం పునరావాసం కల్పించాలని, తక్షణమే డిప్యూటీ స్పీకర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు ఇస్తూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విద్యార్థి దశ నుండి ఉన్నత విలువలు సైద్ధాంతిక రాజకీయ విలువలు కలిగిన వ్యక్తిగా జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. శ్రామిక వర్గ పేదల పక్షాన నిలబడి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని అన్నారు. స్వార్థాలకు పార్టీలను మారుస్తూ నైతిక విలువలు కోల్పోయి జీవితాన్ని గడుపుతున్న ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజు పేదోళ్ల ఇళ్లను తమ అధికారంతో దౌర్జన్యంగా కూల్చివేయడం అన్యాయమన్నారు. నష్టపరిహారం పునరావాసం లేకుండా ఇల్లును కూల్చివేసి ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. దీనిని ప్రశ్నించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఇష్టానుసారంగా అనుచిత వ్యాఖ్యలు అహంకార పూరిత వైఖరితో చేయడం ఖండిస్తున్నామని అన్నారు. దీనిని బలపరుస్తున్న కూటమి ప్రభుత్వం ఫలితం అనుభవించక తప్పదని అన్నారు. తక్షణమే అతని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదోళ్ల ఇళ్ళకు పునరావాసం కల్పించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్ రావు మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, పుల్లయ్య, రెహానా బేగం, జిల్లా కమిటీ సభ్యులు కొండా ప్రసాద్, జి.నాగేశ్వరరావు, షేక్ మస్తాన్ బి,అజీజ్, పెంచలయ్య, దయాకర్, శేషయ్య, గౌస్, కె.పెంచల నరసయ్య,అన్వర్, అల్లాడి గోపాల్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీటిసమస్యను పరిష్కరించాలి : సీపీఎం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ప్రజలకు మున్సిపల్ వాటర్‌ట్యాంకుల నుండి సరఫరా అవుతున్న కలుషిత, రంగుమారిన నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక సిపిఎం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం పట్టణ సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్‌ను కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. గత 20రోజులుగా ఆత్మకూరు పట్టణంలో కొళాయిలద్వారా రంగుమారిన కలుషిత నీరు సరఫరా అవుతున్నాయన్నారు. దాంతో పలువురు అనారోగ్యానికి గురవుతున్నారని, హాస్పిటల్‌పాలవుతున్నారని వారు కమీషనర్‌కు వివరించారు. వెంటనే ఈ కలుషితతాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కమీషనర్‌ను కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ సంధాని (మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్), ఆళ్ళ హజరత్తయ్య, రిటైర్డ్ హౌసింగ్ ఉద్యోగి సంధాని, వాగాల శ్రీహరి, 3వవార్డు పరిధిలోని సిపిఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య, ఆశ కార్యకర్తలు లక్ష్యాలను సాధించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** క్షేత్రస్థాయిలో ఆరోగ్య ఆశ కార్యకర్తలు సిబ్బంది తమకు కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని మండల వైద్యాధికారిని వినీత పేర్కొన్నారు. ఆమె సోమవారం స్థానిక సిహెచ్సి పాత భవనంలో గండిపాలెం పీఎస్‌సీ సిబ్బందితో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్సిడి సర్వేను బాధ్యతగా ఇంటింటికి తిరిగి నిర్వహించాలన్నారు. వేసవిలో వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యకర్తలతోపాటు వెల్నెస్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గర్భిణీల వివరాలను సేకరించి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు చేయించాలన్నారు. అనంతరం కార్యకర్తలకు యూనిఫాం అందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శివకుమారి ఆరోగ్య బోధకులు వెంకటసుబ్బయ్య సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపు ప్రారంభం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలోని శాంతినగర్ శాలివాహన కమ్యూనిటీ హాల్లో పెట్టిన మెడికల్ క్యాంపును చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, వైస్ చైర్మన్ ఎరటపల్లి శివకుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ పఠాన్ నస్రీన్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాచూరి సత్యనారాయణ, కో- ఆప్షన్ నెంబర్ దస్తగిరి, టీడీపీ నాయకులు సాయి బాబా, స్థానిక టీడీపీ నాయకులు, పేషెంట్లు, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కుళాయి పన్నులను విధిగా వసూలు చేయండి : కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో తాగునీటి కుళాయి పన్నులను విధిగా వసూలు చేయాలని అధికారులు, సచివాలయ కార్యదర్శులను కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షలో భాగంగా ఇంజనీరింగ్, హౌసింగ్, టిడ్కో విభాగాలతో కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విధులలో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొనాలని, అలసత్వం వహించరాదని సూచించారు. ప్రతి ఒక్క అమెనిటీస్ కార్యదర్శి ఉదయం 6 గంటలకు క్షేత్రస్థాయిలో ఉండి తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయ పరిధిలోని తాగునీటి కుళాయి కనెక్షన్లు, విద్యుత్ వీధిదీపాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనధికార కుళాయిలను పన్ను పరిధిలోకి తీసుకురావాలని, వాటికి సంబంధించిన చలానాలను సచివాలయాలలోనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఏసీ బస్ షెల్టర్లను క్రమం తప్పకుండా గమనిస్తూ, షెల్టర్లు దుర్వినియోగం కాకుండా పూర్తి బాధ్యతతో పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద రెండు రూపాయలకే 20 లీటర్ల తాగునీటిని అందజేస్తున్న కేంద్రాల గురించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ (ఏఎఫ్‌పీ) ఇచ్చిన లబ్దిదారుల అందరిని స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారము తప్పనిసరిగా ఒక స్టేజ్ కన్వర్షన్ తో పాటు ఒక ఇల్లు నిర్మాణం పూర్తయ్యేలా ప్రణాళికగా పనులను పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, నగరపాలక సంస్థ, హౌసింగ్ విభాగాల డిఈఈలు, ఏఈలు, సూపరింటెండెంట్ నరేంద్ర, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు, వర్క్‌ఇన్స్పెక్టర్ (హౌసింగ్), మీటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు పూర్తి



వెంకటాచలం, మేజర్‌న్యూస్ : కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం ప్రాంగణం జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ సందడితో కళకళలాడేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 30 నుండి మే 8వరకు అఖిల భారత అంతర్యూనివర్సిటీ సాఫ్ట్ బాల్ పోటీలు ఘనంగా జరగనున్నాయి. ఈ విషయాన్ని వర్సిటీ ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత సోమవారం మీడియాకు వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌లో 94 మహిళల జట్లు, 97 పురుషుల జట్లు పాల్గొనబోతుండగా, మొత్తం 3000 మందికి పైగా క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు వర్సిటీని సందర్శించనున్నారు. ఏప్రిల్ 30వ తేదీన ఉదయం 6.30 గంటల నుంచి మహిళల మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. అదే రోజు సాయంత్రం 4 గంటలకు ప్రారంభ వేడుకను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. మహిళల టోర్నమెంట్ మే 3న ముగియనుండగా, మే 4నుంచి పురుషుల పోటీలు ప్రారంభ మవుతాయి. పురుషుల టోర్నమెంట్ ప్రారంభ వేడుకలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి, ఇతర మంత్రులు పాల్గొననున్నారు. టోర్నమెంట్ వివిధ దశల్లో జిల్లాకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు వర్సిటీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 5 ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, రోజుకు సుమారు 35 మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రీడాకారుల వసతి కోసం హాస్టళ్లను సిద్ధం చేయడంతోపాటు తరగతి గదుల్ని కూడా వినియోగిస్తున్నారు. రవాణా సౌకర్యానికి రైల్వే స్టేషన్, బస్టాండ్లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. భోజన ఏర్పాట్లలో సౌత్ ఇండియన్, నార్త్ ఇండియన్ ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. త్రాగునీరు, విద్యుత్ వంటి అంశాల్లో జిల్లా అధికారులు, విద్యుత్ శాఖ పూర్తి సహకారం అందిస్తున్నాయని పేర్కొన్నారు. క్రీడాకారుల భద్రత కోసం పోలీసు శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహితే, వర్సిటీ జాతీయ స్థాయిలో తన ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకునే అవకాశముందని డాక్టర్ కె. సునీత పేర్కొన్నారు. ఈ సమావేశంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీ.హెచ్. విజయ్, పీఆర్వో డాక్టర్ కె. నీలమణికంఠ, టోర్నమెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎ.ప్రవీణ్ కుమార్, మణికంఠ పాల్గొన్నారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్



నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ : నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో పిల్లలకు సమ్మర్ క్యాంపును సోమవారం ఉదయం నెల్లూరు ఇస్కాన్ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మేనేజర్ రాజశేఖర్ దాస్ మాట్లాడుతూ.. ఈ సమ్మర్ క్యాంపు ఐదు రోజుల పాటు జరుగుతుందని, ముఖ్యంగా ఈ సమ్మర్ క్యాంపులో పిల్లలకు ఆధ్యాత్మిక చింతన కల్పించేందుకు ఈ సమ్మర్ క్యాంప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇస్కాన్ అధ్యక్షుడు సుఖదేవ స్వామి సూచన మేరకు క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. మంచి అలవాట్లు భక్తి భావన తోపాటు ఆధ్యాత్మిక కథలు సంకీర్తనలు భగవద్గీత రామాయణం మహాభారతం వంటి పట్నాలు గురించి పిల్లలకి వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఎంతో ఆరోగ్యం



వింజమూరు, మేజర్‌న్యూస్ : ప్రకృతి వ్యవసాయం వలన ఎంతో ఆరోగ్యాన్ని పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ అంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ప్రకృతి వ్యవసాయంపై ప్రదర్శన అమ్మకం, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట తన స్వతహాగా పండించిన కూరగాయలను ప్రదర్శనగా ఉంచారు. ఆ వచ్చిన ప్రజలకు ప్రకృతి వ్యవసాయం వలన పండించిన పంటలు మేలైనవిగా ఉంటాయని నాణ్యమైన పంట అని ఆరోగ్యానికి ఎంతో మేలుగా ఉంటుందని తెలిపారు. ధర కూడా మార్కెట్ కంటే కొంచెం తక్కువగానే ఉందని తెలిపారు. రసాయనిక ఎరువులు ఏమాత్రం వాడకుండా కేవలం జీవామృతం ఘనామృతం ద్రవామృతం కషాయాలను మాత్రమే ఉపయోగించి పండించిన పంట అని తెలిపారు. తమ సొంత పొలాలలో కేవలం 20 సెంట్లు భూమిలో ఆకుకూరలు కాయగూరలను పండిస్తున్నామని, వీటివల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వారు తెలిపారు. ఎలాంటి పదార్థాలు తీసుకోవడం వల్ల అనారోగ్యానికి దూరంగా ఉండగలుగుతామన్నారు. ఇక ఈ కార్యక్రమం ప్రతి సోమవారం వింజమూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శిస్తామని తెలిపారు. మండలంలో వింజమూరు నాలుగో సచివాలయం ఊటుకూరు నంది గుంట బుక్కాపురం కాటేపల్లి ఆర్‌బీకే పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్పీలు కుమారి స్వప్న, వేదవతి, అనూష, మాల్యాద్రి, యూనిట్ ఇన్‌చార్జ్‌లు వెంకట్రావు, మహేంద్రుడు, వినియోగదారులు ఉన్నారు.

## నగరంలో చలివేంద్రాలు..



నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ : డొక్కా సీతమ్మ చలివేంద్రం ఆమని గార్డెన్ వద్ద జనసేన నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సోమవారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని జనసైనికులు నగరంలో ప్రతి ప్రాంతం పార్టీ తపున ఒక చలివేంద్ర ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. టీడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సూచనలతో తాము ఏర్పాటు చేసిన చలివేంద్రలో ప్రతిరోజు మజ్జిగను ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

## అడవిలోనే ప్రాణులు కాదు.. మనుషులు కూడా ప్రాణులే

**బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి**




నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ : సత్యసాయి కెనాల్‌కు అటవీ అనుమతులు తెప్పించాలని తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్‌కు బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. సోమశిల కండలేరు డ్యాములు కంటే రాపూర్ మండల గ్రామాలు ఎత్తులో ఉన్నాయి. రాపూర్‌తోపాటు తొమ్మిది గ్రామాలకు నీటి సౌకర్యం లేదు. సోమశిల నుండి రాపూర్ పెద్ద చెరువుకు నీరందించడం కోసం పుట్టపర్తి సాయిబాబా ట్రస్ట్ నుండి 350 కోట్లు నిధులు ఇచ్చారు. గ్రావిటీ ద్వారా నీరు ప్రవహించే లా70 శాతం కెనాలను తవ్వారు. తెగచర్ల వద్ద వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉన్నందున అనుమతులు లేక కెనాల్ నిర్మాణం ఆగిపోయింది. కెనాల్ తవ్వితే వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరగలేవని అటవీశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంది. ఈ అభయారణ్యంలో కాలువ నిర్మించి దానిపై పదుల సంఖ్యలో వంతెనలు నిర్మిస్తే జంతువుల తిరిగేందుకు స్వేచ్ఛ ఉంటుంది. వన్యప్రాణులు లాగానే మనుషులు కూడా ప్రాణులే కాబట్టి మానవతా దృక్పథంతో పదివేల మందికి నీటి సౌకర్యం అందేలా చర్యలు తీసుకోవాలి. కెనాల్ నిర్మించి వంతెనలు నిర్మిస్తే జంతువులతో పాటు ప్రజలు కూడా అభివృద్ధి పథంలోకి వస్తారని స్పెషల్ కలెక్టర్ హుస్సేన్ సాహెబ్ కు రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, కావటి శిరీష, కళ్ళు భాస్కర్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణ

● రైతులకు భూసార పరీక్షలపై అవగాహన



వెంకటాచలం, మేజర్‌న్యూస్ : ఇసకపాలెం, నిడిగుంట పాలెం, గుడ్లూరు వారి పాలెం గ్రామాల్లో మట్టి నమూనాలను సేకరించి రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా సరైన ఎరువుల వాడకం ద్వారా దిగుబడి పెంచుకొని ఖర్చులు తగ్గించుకోవచ్చని అధికారులు తెలిపారు. రైతులు ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి మట్టి నమూనాలను తీయించుకోవాలని సూచించారు. అదనంగా, అధిక నత్రజని వాడకం వల్ల చీడపీడలు పెరుగుతాయని హెచ్చరించారు. ఎదిగారు సాగు కోసం మే 15వ తేదీలోగా నార్లు వేయాలని, వరి రకాలుగా కెఎన్ఎం 1638, కెఎన్ఎం 733, ఎంఎల్ఆర్ 34449, ఎన్ఎల్ఆర్ 3354 విత్తనాలను ఉపయోగించాలని సూచించారు.

# పిడతా పోలూరులో.. న్యాయ విజ్ఞాన సదస్సు

**సమస్యలపై అర్జీలు సమర్పించిన మహిళలు**



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పిడతా పోలూరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం జరిగింది. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జికే వాణి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమం గురించి సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడారు. ఫోక్స్ చట్టం గురించి వివరించారు. అదేవిధంగా చిన్న వయసులో బాల్య వివాహాలు నేరం అని తెలియ జేశారు. భారత రాజ్యాంగంలో అనేక హక్కులు ప్రతి ఒక్కరికి ఉన్నాయని వివాదాలు జరిగిన ప్పుడు ఆర్థిక సమస్యలు ఉన్న పక్షంలో ఉచిత న్యాయస్థాయం పొందే అవకాశం ఉందని తెలి పారు. ఒక వ్యక్తికి వార్షిక ఆదాయం మూడు లక్షల లోపు ఉంటే ప్రభుత్వం ఉచితంగా న్యాయ సాయం అందిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి అన్నారు. సమస్యల గురించి మూడు కోణాల్లో ఫిర్యాదులు చేసుకునే అవకాశం ఉందన్నారు. టోల్ ఫ్రీ నెంబర్15100 ఫోన్ చేసి కంప్లైంట్ ఇచ్చే అవకాశం ఉందన్నారు. అధికారులు పనిచే యని పక్షంలో ఈ పని చేయాలన్నారు. అనం తరం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి ఎస్.శివ నమ్రత మాట్లాడారు. మహిళలు చట్టాల గురించి తెలుసుకోవాలని తెలిపారు. రాజీ మార్గా న్ని ఎంచుకొని కేసులు పరిష్కారం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో అధికార పార్టీ సీనియర్ నాయకులు, సర్వేపల్లి నియోజకవర్గ తెలుగు యువత కమిటీ కార్యనిర్వాహక కార్య దర్శి దండు శ్రీనివాసులు, నాయకులు కొండా రెడ్డి, మురళీ, పెంచలయ్య, కరిముల్లా, రామ సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, హరీష్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి శేషగిరి, విస్తరణ అధికారి హేమంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆనంని కలిసిన ఏపీఎన్జీవో అసోషియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డిని, ఏపీఎన్జీవో అసోషియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంప్లాయస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షులు నలమారు చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ శ్యామ్ సింగ్, నెల్లూరు జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంప్లాయస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు కె.శివ శంకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ, ఎంప్లాయస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు కనకట్ల మోహన్ రావు ముదిరాజ్, గూడూరు నియోజకవర్గ ఎంప్లాయస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు కలిగి జనార్ధన్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఎంప్లాయస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు రాజగోపాల్ రెడ్డి, కందుకూరు నియోజకవర్గ ఎంప్లాయస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు ఎం.ఆదం, మెట్టుకూరు సుబ్బారెడ్డి, సిద్దన యానాద్ రెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నీటి తీరువా శిస్తు చెల్లించాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలంలోని వింజమూరు రావిపాడు చంద్రపడియా చెరువులకు సంబంధించిన ఆయకట్టుదారులు నీటి తీరువపన్ను చెల్లించాలని తహసిల్దార్ ఎస్డి హమీద్ తెలిపారు. సోమవారం స్థానిక ఛాంబర్‌లో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మూడు గ్రామాల చెరువులకు సంబంధించిన ఆయకట్టు రైతులు చెల్లించాల్సిన నీటి తీరువా శిస్తు 1,18,000గా ఉందని వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. వీఆర్వోలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి శిస్తు వసూలు అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీలైనంత త్వరగా ఈ కార్యక్రమాన్ని ముగించాలని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం వేసవి తాపం ఎక్కువగా ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవ సరం ఉందన్నారు. వృద్ధులు చిన్నారులు అనారోగ్యంగా ఉన్నవారు. తది తరులు ఉదయం 9 తర్వాత సాయంత్రం ఐదు గంటల వరకు బయటకు రాకుండా ఉండడం క్షేమంగా ఉంటుందన్నారు. అసలే మండుతున్న ఎండలు ఈ ఎండలకు వడదెబ్బ లాంటివి ఏర్పడతాయని ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉంటాయన్నారు. కావున ప్రజలు చాలా జాగ్రత్తగా ఉంటూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని అన్నారు అదేవిధంగా రైతులు నోషనల్ ఖాతాలను వెంటనే మార్పు చేయించుకోవాలని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇబ్బందుల గురికాకుండా ఇప్పుడే జాగ్రత్త పడా లని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు మల్లికార్జున, రవితేజ, రమణయ్య, శిరీష, కే.రమణయ్య, బాబురావు, నరసింహారెడ్డి, మీరావలి, ఆర్ఐ ఇమ్రాన్ ఖాన్, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ రిలే దీక్షలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూని యన్ కార్మికులు ఆర్టీసీ డిపో ఎదుట తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం రిలే నిరాహార దీక్షకు శ్రీకారం చుట్టారు.రెండు రోజులపాటు నిర్వహించే ఈ దీక్షల్లో తమ కార్మికుల సమస్యలను పరిష్కారం కోరుతూ నినాదాలు చేశారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ రిలే దీక్షల్లో తమ కార్మికులు పాల్గొంటారని కార్మిక సంఘ నేతలు తెలియపరిచారు. ఆత్మ కూరు ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలైన అసిస్టెంట్ డిపో సెక్రటరీ పద్మారావు, యూనియన్ ఆత్మకూరు సెక్రెటరీ మస్తానయ్య ఆధ్వర్యంలో డిపోకు చెందిన కార్మికులు ఈ దీక్షల్లో పాల్గొన్నారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ జిందాబాద్ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినా దాలు చేశారు. తమ సమస్యలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి తమ రాష్ట్ర యూనియన్ నేతలు తెలియపరిచిన పరిష్కారం కాకపోవడంతో తాము ఈ దీక్షలు ప్రారంభించినట్లు నేతలు తెలిపారు. తమ ఉద్యోగ భద్రత కోసం గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో రూపొందించిన జీవోను గత పాలకులు రద్దు పరచడంపై నిరసిస్తూ వెంటనే వాటిని కొనసాగించాలని అలాగే తమ కార్మికుల పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ ఈ సందర్భంగా వారు తెలియపరిచారు. మంగళవారం కూడా తమ దీక్షను నిర్వహిస్తామని యూనియన్ అసిస్టెంట్ డిపో సెక్రటరీ పద్మారావు తెలిపారు.

# పుస్తక పఠనం విద్యార్థికి ఎంతో ప్రయోజనం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పుస్తక పఠనం వలన విద్యార్థికి ఎంతో ప్రయోజ నకరంగా ఉంటుందని గ్రంథాలయాధి కారి జ్యోతి కొండయ్య తెలిపారు. సోమవారం గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభ సందర్భంగా పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థులకు మొదటి నుండి పుస్తక పఠనం అలవాటు కావాలని అది ఎంతో మంచి అలవాటుగా ఉంటుందన్నారు పుస్తకం పట్టణం అనేది విజ్ఞాన సర్వస్వం అందులోనే ఉంటుందన్నారు. కాబట్టి విద్యార్థులు పాఠ్యాంశాలను తప్పనిసరిగా పుస్తకాన్ని చదివి అర్థం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. కేవలం మెటీరియల్ తో మాత్రమే విజ్ఞానం అందిరాదని ఆయన తెలిపారు. బుక్ రీడింగ్ ఇస్ ద బెస్ట్ పాలసీ అన్న విధంగా పుస్తక పఠనం చాలా గొప్పది అన్నారు. కాబట్టి విద్యార్థులు ఎప్పుడూ పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** రావూరు కండ్రిగ వద్ద రోడ్డు పక్కన ఓ వ్యక్తి అనుమానా స్పదం గా మృతి చెంది ఉండడం స్థాని కంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట మండలం పరిధిలోని రావూరు కండ్రిగ వద్ద రోడ్డు పక్కన ఓ వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారం మేరకు ఇందుకూరుపేట ఎస్ఐ నాగార్జునరెడ్డి తమ సిబ్బందితో హుటాహుటిన ఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వారివిచారణలో మృతుడి వివరాలు లభ్యమయ్యాయి. కోవూరు మండలం చెర్లోపల్లికి చెందిన కవరగిరి రవి(44)గా గుర్తించారు. మృతదేహాన్ని శవ పంచనామా కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.

# 30న వీఆర్ఏల నిరసన కార్యక్రమం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** తమ న్యాయమైన దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ వీఆర్ఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 30వ తేదీన స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ సంఘం మండల నాయకులు ఆర్.దుర్గయ్య సోమవారం తోటి వీఆర్ఏలతో కలిసి తాసిల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థలో కిందిస్థాయి ఉద్యోగులుగా వీఆర్ఏలు ఎన్నో ఏళ్ల నుండి పనిచేస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక పలు ఇబ్బందులు పడుతున్నామన్నారు. వీఆర్ఏల వేతనాలు పెంపుదలతో పాటు ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# పాలీసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : ప్రిన్సిపల్



**కావలి, మేజర్‌న్యూస్ :** ఏప్రిల్ 30వ తేదీన జరగబోయే పాలీసెట్ పరీక్షకు అన్ని విధాలుగా సర్వము సిద్ధం చేసినట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపల్, కావలి పాలీసెట్ కోఆర్డినేటర్ డా.ఎ.సుశీల్ కుమార్ ప్రియ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొత్తం. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులలో 297 మంది విద్యార్థులకు కావలి పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో, 299 మంది విద్యార్థులకు రుద్రకోట వద్ద ఉన్న గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలో పరీక్షలు వ్రాసేందుకు వీలు కల్పించినట్లు ఆయన తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి ఉదయం 10గంటల నుండి హాల్ టికెట్‌తో లోపలికి అనుమతిస్తారని తెలిపారు. పరీక్షా సమయం ఉ. 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పేర్కొన్నారు. ఒక నిమిషం ఆలస్యం అయినా పరీక్షకు అనుమతించరని అభ్యర్థులందరూ కేటాయించిన సెంటర్ కుకొద్దీ నిముషాలు ముందుగా చేరుకుని పాలిసెట్ పరీక్ష ఎక్కడ అటంకాలు లేకుండా ఉండాలి అని కోరారు. జిల్లా అధికారులు, కావలి డివిజన్ అధికారుల ఆదేశానుసారంగా రెవిన్యూ, మున్సిపల్, పోలీస్, ఆర్టీసీ, హెల్త్ తదితర శాఖల సమన్వయంతో బుధవారం పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని తెలియజేసారు.

# రెడ్‌క్రాస్ చలివేంద్రం ప్రారంభించిన ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ



**కావలి, మేజర్‌న్యూస్ :** వేసవికాల విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో కావలి రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్డీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండలో తిరుగకూడదని, తలపై టోపీ, లేదా తువ్వాలు ధరించి బయటకు రావాలని అన్నారు. వడదెబ్బపై అవగాహన కలిగించేందుకు రెడ్ క్రాస్ ద్వారా దృశ్య శ్రవణ వాట్సాప్ క్లిప్పింగ్‌ను ప్రత్యేకంగా తయారుచేసి అన్నీ గ్రూపులకు పంపుతున్నామని అన్నారు. మే నెలలో తుఫానులు, అకాలవర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ పేర్కొన్నారు.రెడ్ క్రాస్ ద్వారా ఇప్పటికే ఆర్టీసీ బస్టాండ్ లో ఒక చలివేంద్రం నిర్వహిస్తున్నామని, వివిధ పనులపై ఆర్డీఓ కార్యాలయానికి వచ్చేవారి కొరకు సోమవారం, మరో చలివేంద్రాన్ని ప్రారంభించామని వివరించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, కావలి రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, చైర్మన్ డి.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె.హరినారప రెడ్డి, పాలకమండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, బీదా లక్ష్మీనంద, నల్లిపోగు ప్రణీత్, బెజవాడ ప్రసన్నకుమార్, డాక్టర్ రమ్య, కల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ ప్రొఫెషనల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా అసోసియేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. వాహన ప్రమాద సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా హెల్మెట్లు కూడా అంద జేయడం జరిగింది. సభ్యుల కుటుంబాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి మెమొటోలు, గిఫ్ట్ ఆర్టికల్స్ ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం చూపాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జ్ఞాపకాలను కెమెరాలు బంధించి పది కాలాలపాటు నిలిపేవారు ఫోటోగ్రాఫర్‌లని వీడియో గ్రాఫర్లను కొనియాడారు. అధిక టెక్నాలజీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాన్ని పెంచుకొని ఆకర్షణీయమైన ఫోటోలు, వీడియోలు తీసే విధంగా మార్పులు చెందాలని వారికి సూచించారు. అసోసియేషన్ ఇంకా అవసరమైన భవన నిర్మాణానికి కావలసిన స్థలాన్ని ఒక నెలలో చూపిస్తానని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు కలిసి మెలిసి ఉండాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కావలి డిఎస్పి పి.శ్రీధర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సుందర్రావు డాక్టర్ రామస్వామి టిడిపి నాయకులు రాజకుమార్, పొట్లూరు శ్రీనివాసులు, పోతుగంటి అలేఖ్య,తిరువీధి ప్రసాద్, జనసేన కావలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ అలహరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దామిశెట్టి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి, ఎమ్మెల్యే




**కావలి, మేజర్‌న్యూస్ :** ఇటీవల స్వర్గస్తులైన కావలి డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ దామిశెట్టి శ్రీనివాస నాయుడు కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డితో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కలిసి పరామర్శించారు. తమ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మాకు అత్యంత ఆప్తులు, దశాబ్దాల కాలంగా రాజకీయాలలో శీనయ్యతో మాకు మంచి అనుబంధం ఉందన్నారు. శీనయ్య మన మధ్య లేకపోవడం, ఆయన లేకుండా వారి కుటుంబ సభ్యులను పలకరించడం చాలా బాధాకరంగా ఉందన్నారు. మంచి వ్యక్తిత్వం గల వ్యక్తి, విద్యాదాత, కావలి పట్టణ ప్రజలకు సుపరిచితులైన దామిశెట్టి శ్రీనివాస నాయుడు మృతికి సంతాపం తెలుపుతూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆదరణ దయచేయలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానారు. ఈ కార్యక్రమంలో కావలి తెలుగుదేశం పార్టీ నాయకులు రాజకుమార్, పొట్లూరి శ్రీనివాసులు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ పద్ధతుల్లో కూరగాయలు పెంచండి




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలోని మండల వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయలను అమ్మడం జరిగింది. సేంద్రీయ పద్ధతిలో కూరగాయలు పండించడం అంటే రసాయన ఎరువులు, పురుగుమందులు, లేదా జన్యుపరంగా మార్పు చేయబడిన విత్తనాలు వాడకుండా పండించడం. ఈ పద్ధతిలో, నేల ఆరోగ్యం, జీవవైవిద్యాన్ని పెంపొందించడానికి సహజమైన పద్ధతిలో సేంద్రీయ కూరగాయలు రసాయన అవశేషాలు లేకుండా పండించబడతాయి. కాబట్టి అవి ఆరోగ్యకరమైనవి, రుచికరమైనవిగా ఉంటాయి. పై చెప్పిన విధంగా రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించి తినడం వల్ల ఏ అనారోగ్య బారినా పడకుండా ఆరోగ్యంగా ఉండే దానికి అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి హైమావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పోలేరమ్మ అమ్మవారి గుడిలో చోరీ



**వింజమూరు / కలిగిరి, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండలం పేద అన్నలూరు గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి గుడిలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయంలోఉన్న అమ్మవారి మెడలో హారం కమ్మలు చిన్నచిన్న ఆభరణాలు చోరీ చేసినట్లు వారు తెలిపారు. వీటి విలువ సుమారు పదివేలు ఉంటుందని ఆలయ అర్చకులు మాల్యాద్రి తెలిపారు. ఆలయం చిన్నదైనప్పటికీ ఎంతో పురాతనంగా ఉండి గ్రామ దేవతగా వెలసియున్న ఈ పోలేరమ్మ తల్లి ఈ గ్రామాన్ని సర్వ విధాల కాపాడుతూ కొలువై ఉంది. అలాంటి ఆలయంలో చోరీ చేయడం వారి దురదృష్టకరమన్నారు. ఆలయాన్ని ఎప్పటిలాగే ఆదివారం ఉదయం తెరచి సాయంత్రం తలుపులు మూసి ఇంటికి వెళ్లారు. ఉదయాన్నే ఆలయానికి రాగా తలుపులు పగలగొట్టి ఉండడం గమనించి చూడక అమ్మవారి మెడలోని హారాలు ఇతర సొమ్ములు చోరీకి గురైనట్లు గమనించారు. ఆలయ అర్చకులు గ్రామ పెద్దలకు తెలియజేశారు. వారిని విషయాన్ని గమనించి ఇకనైనా జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు.

# దగదర్తిలో ఉచిత వైద్య శిబిరం



**కావలి, మేజర్‌న్యూస్ :** దగదర్తి మండలం మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్, దగదర్తి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు కుమారుడు యువనేత మాలేపాటి భానుచందర్ జన్మదిన సందర్భంగా సోమవారం దగదర్తి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నందు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాల నెల్లూరు వారి సౌజన్యంతో మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాలేపాటి రవీంద్ర నాయుడు, మాలేపాటి సుబ్బానాయుడు హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు కంటి అద్దాలు, శాస్త్ర చికిత్స అవసరమైన వారికి చేయిస్తానని తెలిపారు. జన్మదిన సందర్భంగా ఇటువంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టినందుకు చాలా సంతోషంగా ఉందని మాలేపాటి భానుచందర్ తెలిపారు.

# పేకాట స్థావరాలపై మెరుపు దాడులు



**దగదర్తి, మేజర్‌న్యూస్ :** దగదర్తి మండలం తిరువీధిపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారంతో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి దగదర్తి ఎస్సై జంపాని కుమార్ వారి సిబ్బంది. ఈ దాడులలో ఐదుగురు పేకాటరాయలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1930/ నగదును స్వాధీనపరుచుకున్నారు. మండలంలో ఎవరైనా పేకాట కోడిపందెం జూదాలు లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

# పారిశుద్ధ్య పనులు అధికారులు పరిశీలన

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 19వ వార్డు అన్న క్యాంటీన్ వద్ద ఉన్న మీడియం డ్రైన్ కాలువ పూడికతీత పనులను సోమవారం పర్యవేక్షించారు. ఆ విధంగానే మిగతా వార్డులలో కూడా డ్రైన్ అడుగుభాగం వరకు పూడిక తీయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం 45వ వార్డ్ పొగతోట లోని డోర్ టు డోర్ కలెక్షన్ చెత్త సేకరణను, బ్లాక్ స్పాట్స్‌ను పర్యవేక్షించారు. బయో మెడికల్ వేస్ట్ జనరల్ వేస్ట్ లో కలవకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.



# గ్రామాభివృద్ధే రాష్ట్రాభివృద్ధి

- సమన్వయంతో పనిచేస్తేనే గ్రామస్వరాజ్యం
- బద్దిపూడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు
- వైసీపీని వీడి టీడీపీలో చేరిన 500 మంది
- మంత్రి రవికుమార్, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం కూనం రాఘవ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 500 మంది తెలుగుదేశం పార్టీలో చేరగా.. వారికి పార్టీ కండువాలు వేసి నేతలు ఆహ్వానించారు. గ్రామానికి చేరుకున్న నేతలకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో 50 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు.. బిందెకు నీళ్లు పట్టి మహిళలకు అందించారు. అనంతరం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు వేదికపై కూనం రాఘవరెడ్డి, ఆయన అనుచరవర్గం దాదాపు 500మంది మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి నేతలు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉలవపాడు మండలంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. బద్దిపూడి గ్రామంలో ప్రతి ఇంటికి పైప్ లైన్ తో నీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. గ్రామాల్లో నాయకులు కలిసికట్టుగా ముందుకు సాగి అభివృద్ధి చేసుకోవాలన్నారు. చంద్రబాబు పాలన మెచ్చి పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు అధ్వానంగా ఉండేవని, ఇప్పుడు ఎక్కడ చూసినా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఈ గ్రామానికి వచ్చామని, తమకు ఎంతో మద్దతు ఇచ్చారని ఎంపీ గుర్తు చేశారు. తప్పకుండా గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు నీటి సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎన్నడులేని విధంగా మండలంలోని ప్రతి గ్రామానికి శాశ్వత మంచినీటి వసతి కల్పిస్తున్నారన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామీణ ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. బద్దిపూడిలో ఇక వైసీపీ లేదని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో ఈ గ్రామానికి వచ్చినప్పుడు నాయకులు తమ వెంట నడిచారని గుర్తు చేశారు. అలాగే తాము అడిగిన వెంటనే సబ్ స్టేషన్లను కేటాయించి కరెంట్ సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, స్థానిక నాయకులు బ్రహ్మానంద రెడ్డి, చేజర్ల వెంకట్రామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీనివాసులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు





**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.అఖిల, 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.దేవిక తమ పదవీ కాలంలో న్యాయ వాదులతో కోర్టు సిబ్బందితో ఎంతో స్నేహ పూర్వకంగా వ్యవహరించి వారి పదవులకు వన్నె తెచ్చారని నెల్లూరు నగర న్యాయవాదులు శ్లాఘించారు. సోమవారం వారి గౌరవార్థం నెల్లూరు బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు ఎంతగానో సహకరించారని ఈ సందర్భంగా న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. న్యాయవాదులకు సంబంధించిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని, ముఖ్యంగా జిల్లా కోర్టు భవనాలకు సంబంధించిన లిఫ్ట్ సౌకర్యం త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. బదిలీపై వెళుతున్న న్యాయమూర్తులకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు వారికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా తమ విధి నిర్వహణలో సహకరించిన న్యాయవాదులకు బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులు బి.అఖిల, జి.దేవిక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సుందరయ్య యాదవ్ మహిళా రెప్రజెంటేటివ్ రేఖా రాణి లైబ్రరీ కార్యదర్శి స్వర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ కోర్టుల న్యాయమూర్తులు, పెద్ద ఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు.

## వైసీపీ కేంద్ర కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** తాడేపల్లిలోని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు, అనుబంధ విభాగాల రాష్ట్ర అధికార ప్రతినిధులతో పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన రాష్ట్ర, జిల్లా అధికార ప్రతినిధుల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా అధికార ప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం తరఫున సమావేశానికి హాజరైన జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి అబ్దుల్ సలీం, కోవూరు నియోజకవర్గ తరుపున రాష్ట్ర రైతు విభాగ అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్ర రెడ్డి,మాజీ డీసీసీబీ ఛైర్మన్ సూళ్లూరుపేట జిల్లా అధికార ప్రతినిధి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ జడ్పీటిసి సర్వేపల్లి జిల్లా అధికార ప్రతినిధి నెల్లూరు శివప్రసాద్, నెల్లూరు సిటీ అధికార ప్రతినిధి ఎంవి సుబ్బారెడ్డి (నేతాజీ), గూడూరు అధికార ప్రతినిధి కొడవలూరు భక్తవత్సల రెడ్డి, కందుకూరు అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, వివిధ జిల్లాల పార్టీ అధికార ప్రతినిధులు, అనుబంధ విభాగాల రాష్ట్ర అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆశ్వవాహనంపై భగవద్రామానుజాచార్యులు



**నెల్లూరు కల్చర్, మేజర్‌న్యూస్ :** శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం, రంగనాయకులపేట, నెల్లూరు నందు సోమవారం శ్రీభగవద్రామానుజాచార్యుల 1008వ అవతారోత్సవాలు సందర్భంగా ఉదయం తిరుమంజనం జరిగింది. సాయంత్రం మంగళశాసనోస్తవం తదుపరి ఆశ్వ వాహనం, డిల్లి ఉత్సవం, పేట ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా శ్రీ వరద వెంకట శేషయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంకు ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, దేవస్థాన సిబ్బంది, అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మైనారిటీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు : ఎమ్మెల్సీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు 42 వ డివిజన్ కోటమిట్ట మున్సిపల్ పార్కులో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మైనార్టీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిటీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. 42వ డివిజన్ వైస్సార్సీపీ నాయకులు అబ్దుల్ మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి స్థానిక నేతలు, ప్రజలు తరలివచ్చారు. ఈసందర్భంగా 110 మంది మైనార్టీ విద్యార్థులకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రతిభ పురస్కారాలు అందజేసి సత్కరించారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. అబ్దుల్ మస్తాన్ ప్రతిభా పురస్కారాలు పంపిణి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. విద్య యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకొని వారి పిల్లల్ని బాగా చదివిస్తున్నారని తెలిపారు. చదువుకున్న ప్రతి ఒక్కరికి విద్య, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో చదువుకోవడానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీజం వేశారని వారి కృషి ఫలితంగా ఈరోజు ఎంతోమంది ఇంజనీర్లుగా డాక్టర్లుగా సైంటిస్టులుగా వారి వారి వృత్తుల్లో స్థిరపడి దేశానికి సేవలందిస్తున్నారని తెలిపారు. తాను 27 సంవత్సరాల నుంచి విద్యా సంస్థలు నడుపుతున్నానని పేద విద్యార్థులు చదువుకునేందుకు తమ కళాశాలలో అనేక విధాలుగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కరిముల్లా, వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు హంజా హుస్సేని, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల, రాష్ట్ర మేధావుల ఫోరమ్ అధికార ప్రతినిధి సమీర్ ఖాన్,జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయకృష్ణా రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సిద్దిక్,ముస్లిం సంచార జాతుల విభాగం అధ్యక్షులు బాబా భాయ్, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మున్వర్, స్థానిక వైసీపీ నేతలు జమీర్, షాకీర్ యాసద్దాని, తౌఫిక్, బాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పర్యటన విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** మే 2వ తేదీన అమరావతిలో జరగనున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన విజయవంతం చేద్దామని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మోడీ అమరావతి పర్యటన నిమిత్తం చిలకలూరిపేట ఇన్‌చార్జ్‌గా కావ్య క్రిష్ణారెడ్డి ని తెలుగుదేశం పార్టీ నియమించింది. సోమవారం చిలకలూరిపేటకు విచ్చేసిన కావ్య క్రిష్ణారెడ్డికి స్థానిక శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు ఘన స్వాగతం పలికారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రజల రాజధాని అమరావతికి వచ్చే ప్రధాని మంత్రి మోడీకి పెద్ద ఎత్తున జనంతో స్వాగతం పలకాలని, నియోజకవర్గంలోని నాయకులు ఆ దిశగా చర్యలు చేపట్టేలా కృషి చేద్దామని తెలిపారు.

# సిఎం పర్యటనను విజయవంతం చేయాలి : మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులంతా సమన్వయంతో పనిచేసి మే1వ తేదీన ఆత్మకూరులో పర్యటించనున్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. సోమవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి కార్యక్రమాలు, ఏర్పాట్లు గురించి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్, సిపం ప్రోగ్రామ్స్ ఆఫీసర్ పెందుర్తి వెంకటేష్‌లు కూడా పాల్గొన్న ఈ సమావేశంలో మంత్రి రామ నారాయణరెడ్డి ప్రసంగించారు. సిఎం పర్యటనకు అధికారులు శాఖల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు మే1వతేదీన ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3గంటలవరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆత్మకూరులో పర్యటించనున్నారని మంత్రి వివరించారు. ఆత్మకూరు బైపాస్‌రోడ్‌వద్ద బిసి గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌వద్దకు ముఖ్యమంత్రి చేరుకొని అక్కడనుండి 8కిలోమీటర్లలోని నాగరంపేటవద్ద ఎంఎస్‌ఎంఇ పార్కు వద్ద పైలాన్ ఆవిష్కరణ గావిస్తారని, అక్కడ నుండి నెల్లూరుపాళెం గిరిజనకాలనీ లేదా బిసికాలనీకి చేరుకొని అక్కడ పెన్షన్లు పంపిణీ చేస్తారని మంత్రి తెలిపారు. అక్కడి కుటుంబాల ఆర్థికపరిస్థితిని ముఖ్యమంత్రి తెలుసుకుంటారని, వారి జీవనవిధానాలు పెంపొందించేందుకు ప్రభుత్వ తరపున ఆలోచనచేస్తారన్నారు. భవననిర్మాణ కార్మికులతో ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడుతారని, అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలను సందర్శిస్తారని, గతంలో 100పడకల స్థాయిని 150కిపెంచుతూ భవనాల నిర్మాణాలకు 16కోట్ల రూపాయలు మంజూరుచేస్తూ ప్రకటనచేసే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. అనంతరం రవితేజ కళ్యాణమండపంవద్ద ప్రవేటులేఅవుట్ స్థలంలో ప్రజావేదిక బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొని ప్రసంగిస్తారని ఆనం వెల్లడించారు. బిసిగురుకుల పాఠశాలవద్ద 300మంది టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారన్నారు. సోమశిల హైలెవల్‌కెనాల్, సోమశిల ఆప్రాన్ మరమ్మత్తులు, సోమేశ్వరాలయం అభివృద్ధి పనులు, ఇరిగేషన్ పనులు, సంగం బ్యారేజి నుండి జాతీయ రహదారికి అనుసంధానం, విక్రమసింహపురి యూనివర్శిటి ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఇంజనీరింగ్ కాలేజి ఏర్పాటు, నెల్లూరుపాళెం వద్ద నగరవనం ఏర్పాటు, క్రీడావికాసకేంద్రం ఏర్పాటు, రాష్ట్ర హైవేను జాతీయ హైవేగా మార్పు తదితరాల ప్రతిపాదనలు,. పురోభివృద్ధి గురించి సంబంధిత అధికారులు నివేదికలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. నారంపేట ఎంఎస్‌ఎంఇ పార్కువద్ద రోడ్లు, విద్యుత్‌లైన్లు పూర్తయ్యాయని, రాష్ట్ర వ్యాప్తంగా పార్కులను నారంపేటవద్దనుండే ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గం పనులు పిడుగురాళ్ళ వరకు పూర్తయ్యాయని, మన జిల్లాలో భూసేకరణ సమస్య ఉందని, కలెక్టర్‌తో చర్చించి పరిష్కరిస్తామని రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈసమావేశంలో ఆర్డీవో బి.పావని, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, హసింగ్ పి.డి వేణుగోపాల్, డిఆర్‌డిఏ పి.డి నాగరాజకుమారి, తెలుగుగంగ ఎస్‌ఇ రాధాకృష్ణారెడ్డి, స్పెషల్‌కలెక్టర్ హుస్సేన్‌సాహెబ్, డిఎంఅండ్‌హెచ్‌వో సుజాత, ఆత్మకూరు హాస్పిటల్ సూపరింటెంట్ గంగారత్నం, మెప్మా పి.డి రాధమ్మ, పరిశ్రమలశాఖ జిఎం మారుతీప్రసాద్, ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, నియోజకవర్గ టిడిపి నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, ఆనం రంగమయూర్‌రెడ్డి, మెటుకూరు ధనుంజయరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, కిలారి సుబ్రహ్మణ్యంనాయుడు, రాష్ట్ర తెలుగుదేశం



కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ షేక్ సర్దార్, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు మండల తెలుగుదేశం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కరరెడ్డి, ఆత్మకూరు సాగునీటిసంఘ చైర్మెన్ మాదాల మస్తాన్‌నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, గంధళ్ళ వేణు, మాదాల శ్రీనివాసులు నాయుడు, షేక్ గౌస్‌బాషా, షేక్ మహబూబ్‌బాషా, కొప్పోలు రమాదేవి, పొడమేకల పెంచలయ్యయాదవ్, దగ్గుమాటి శివకోటారెడ్డి, మొలబంటి రాజశేఖర్, జిల్లా టిడిపి నాయకులు చంద్రా వెంకటసుబ్బానాయుడు, మద్దినేని నారాయణ, మండల తెలుగుయువత అధ్యక్షుడు తలచీరు బాబునాయుడు, తెలుగుదేశం వివిద స్థాయి నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, నలిశెట్టి శ్రీనయ్య, దోర్నాదుల సురేష్‌బాబు, పూనుగుంట ధనుంజయ, షేక్ జిలానిబాషా,పొన్నూరు హజరత్తయ్య, జి.నాగభూషణమ్మ, రేష్మా, మంగమ్మ, చెరుకూరు పద్మావతమ్మ, తోట సుబ్బారావు, తోడేటి వెంకటయ్య, గోరీషబ్బీర్, కొప్పోలు చిన్నపురెడ్డి, నాగినేని పెంచలనాయుడు, తూమాటి తిరుపతినాయుడు, పలువురు అధికారులు,. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి ఆనం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో మే1వతేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు పర్యటించనున్న విషయం తెల్సిందేకాగా సోమవారం రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్, సిఎం ప్రోగ్రామ్స్‌ఆఫీసర్ పెందుర్తి వెంకటేష్‌లతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఆత్మకూరు పట్టణ శివార్లలోని అభయాంజనేయస్వామి విగ్రహం సమీపంలోని గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను మంత్రి, అధికారులు పరిశీలించారు. నెల్లూరు-ముంబై రహదారిపై అనంతరం ఆత్మకూరు మండలంలోని నారంపేట వద్ద ముఖ్యమంత్రి ప్రారంభించనున్న పారిశ్రామికపార్కును వారు పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం నెల్లూరుపాళెం గిరిజన కాలనీలో ముఖ్యమంత్రి పెన్షన్ల కార్యక్రమం నిర్వహించనుండగా అక్కడ కూడా మంత్రి ఆనం, అధికారులు పరిశీలించారు. అక్కడి గిరిజనులతో మంత్రి మాట్లాడారు. పార్టీ కార్యకర్తల సమావేశం కోసం బిసి గురుకుల పాఠశాల మైదానాన్ని కూడా మంత్రి పరిశీలించారు. ముఖ్యమంత్రి బహిరంగసభ ఏర్పాటుకు స్థానిక వ్యవసాయమార్కెట్‌కమిటీ మైదానం, బట్టేపాడు మార్గంలోని వాటర్‌ప్లాంటుసమీపంలోని పార్కు, రవితేజ కళ్యాణమండపం సమీపంలోని స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మంత్రి రామనారాయణరెడ్డి సిఎం కార్యక్రమం గురించి సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు పటిష్టంగా ఏర్పాట్లు గావించాలని మంత్రి రామనారాయణరెడ్డి కోరారు. స్థానిక తెలుగుదేశం నాయకులు,ప్రజాప్రతినిధులతో కూడా మంత్రి రామనారాయణరెడ్డి ముఖ్యమంత్రి పర్యటనా కార్యక్రమాల ఏర్పాట్లు గురించి చర్చించి అధికారులకు సహకరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావని, వివిద శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి, నియోజకవర్గ టిడిపి నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, ఆనం రంగమయూర్‌రెడ్డి,మెటుకూరు ధనుంజయరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, కిలారి సుబ్రహ్మణ్యంనాయుడు, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్ షేక్ సర్దార్, ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు మండల తెలుగుదేశం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కరరెడ్డి, ఆత్మకూరు సాగునీటిసంఘ చైర్మెన్ మాదాల మస్తాన్‌నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, గంధళ్ళ వేణు, మాదాల శ్రీనివాసులునాయుడు, షేక్ గౌస్‌బాషా, షేక్ మహబూబ్‌బాషా, కొప్పోలు రమాదేవి, పొడమేకల పెంచలయ్యయాదవ్, దగ్గుమాటి శివకోటారెడ్డి, మొలబంటి రాజశేఖర్, జిల్లా టిడిపి నాయకులు చంద్రా వెంకటసుబ్బానాయుడు, మద్దినేని నారాయణ, మండల తెలుగుయువత అధ్యక్షుడు తలచీరు బాబునాయుడు, తెలుగుదేశం వివిద స్థాయి నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, నలిశెట్టి శ్రీనయ్య, దోర్నాదుల సురేష్‌బాబు, పూనుగుంట ధనుంజయ, షేక్ జిలానిబాషా,పొన్నూరు హజరత్తయ్య, జి.నాగభూషణమ్మ, రేష్మా, మంగమ్మ, చెరుకూరు పద్మావతమ్మ, తోట సుబ్బారావు, తోడేటి వెంకటయ్య, గోరీషబ్బీర్, కొప్పోలు చిన్నపురెడ్డి, నాగినేని పెంచలనాయుడు, తూమాటి తిరుపతినాయుడు, పలువురు అధికారులు,. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వం ప్రయోజనకరం : టీడీపీ నేత



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వం బహుళ ప్రయోజనకరమని ఆత్మకూరు మండల తెలుగుదేశం ప్రధానకార్యదర్శి కేతా విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెర్లోయడవల్లిలో పార్టీసభ్యత్వ కార్డులను ఆయన పంపిణీ చేశారు. గత నెలవరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలో టిడిపి సభ్యత్వనమోదును అన్నిమండలాల్లో నాయకులు, కార్యకర్తలు అత్యంత శ్రద్ధతో, పట్టుదలతో చేయడం, రాష్ట్రంలోనే సభ్యత్వనమోదులో ద్వితియస్థానంలో నిలవడం తెల్సిందే. కాగా ఆ సభ్యత్వనమోదు కార్డులు పార్టీ ప్రధానకార్యాలయం నుండి ఆత్మకూరుకు రాగా ఓ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి పంపిణీ చేశారు. ఈసందర్భంగా విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాలమేరకు మంత్రి రామనారాయణరెడ్డి ప్రత్యేకదృష్టి సారించడంతో అధికంగా సభ్యత్వాలను నమోదుచేశామన్నారు. కాగా ఈ సభ్యత్వం స్వీకరించిన నాయకులు, కార్యకర్తలకు బహుళప్రయోజనం కలుగుతుందన్నారు. పార్టీ జాతీయప్రధానకార్యదర్శి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని కార్యకర్తల సంక్షేమానికి గాను భీమా సౌకర్యం కల్పించారన్నారు. సభ్యత్వం స్వీకరించిన వారికి పార్టీలో గుర్తింపు, అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాల్లో ప్రాధాన్యతతోపాటు భీమా సౌకర్యం కూడా ఉంటుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వాలను స్వచ్ఛందంగా స్వీకరించారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం సాధిస్తున్న సమాంతర అభివృద్ధి, సంక్షేమం పట్ల ఆకర్షితులై అధికంగా తమ పార్టీ సభ్యత్వం స్వీకరించారని, తమ పార్టీనాయకులు, ముఖ్య కార్యకర్తలు అధికంగా శాశ్వతసభ్యత్వాలు కూడా స్వీకరించారని విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు మానవత్వంతో కూడిన పరిష్కారం చూపాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు మానవత్వంతో కూడిన పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలసి నిర్వహించి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ.. ప్రజల నుండి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్న దృష్ట్యా, మానవత్వంతో కూడిన పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రీఓపెన్ అవుతున్నటువంటి కేసులలో రెవిన్యూ అధికారులు అత్యంత జాగ్రత్తగా పరిష్కారం చూపాలన్నారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 455 అర్జీలు :** కాగా సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 455 అర్జీలు అందాయి. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 194, పోలీస్ శాఖకు 63, మున్సిపల్‌శాఖకు సంబంధించి 30, సర్వేకు 43, పంచాయతీరాజ్‌శాఖకు 31 అర్జీలు అందాయి.

**పది పరీక్షల్లో కేజీబీవీ విద్యార్థినులు భళా :** ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన జిల్లాలోని కేజీబీవీల విద్యార్థినులకు జాయింట్ కలెక్టర్ మెమెంటోలను అందజేశారు. 573 మార్కులు సాధించిన వలేటివారిపాలెం కేజీబివి విద్యార్థిని జి. వైష్ణవి, 569 మార్కులు సాధించిన లింగసముద్రం కేజీబివి విద్యార్థిని యం. అమృత ప్రియ, 567 మార్కులు సాధించిన కలిగిరి కేజీబివి విద్యార్థిని పి. మహిమలకు మెమెంటోలు అందజేశారు.

**సంతోషంతో భోంచేస్తున్న అర్జీదారులు :** సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేసింది. మండేఎండలకు చల్లని మంచినీరు కోసం చూసే అర్జీదారులకు చక్కటి రుచికరమైన భోజనం పెడుతుండటంతో తమ కళ్ళతోనే ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఉదయభాస్కర్, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్ రావు , హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత, ఏపీఎం ఐపీ పీడీ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఏడి సుబ్బారెడ్డి, విద్యుత్ ఎస్ఈ విజయన్, డీఈఓ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఎపిఒ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉండి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం : సీపీఎం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలంలో పేదల ఇల్లు అన్యాయంగా కూల్చి వేసిన దానిపై మాట్లాడిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై రఘురామ కృష్ణరాజు అనుచితంగా అసభ్యంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా సెక్రెటరీ కామ్రేడ్ మాదాల వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ.. మేడే కార్యక్రమాన్ని అన్ని గ్రామాలలో జయప్రదం చేయాలని అలాగే నెల్లూరులో జరుగుతున్న ప్రదర్శన లో పాల్గొనాలని మే నెల 6వ తేదీ టౌన్ హాల్లో జరుగుతున్న బుద్ధం చరణం గచ్ఛామి అనే అంబేద్కర్ గారి నాటకాన్ని మండలం నుంచి ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ మండల కమిటీ సభ్యులు శ్రీపతి వెంకయ్య, జాన లక్ష్మీప్రసాద్, పర్చూరు ప్రభాకర్, గడ్డం వెంకటేశ్వర్లు, శ్రీపతి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తుంది




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లను నిలువున మోసం చేసిందని రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంప్లాయిస్, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. సోమవారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక రకాల వాగ్దానాలను ఉద్యోగులకు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు మూడు డీఏలు పెండింగ్ ఉండగా దాని ఊసే లేదని చెప్పారు. క్యాబినెట్ మీటింగ్ జరిగినప్పుడల్లా ఉద్యోగులకు డీఏలు ఆమోదం తెలుపుతారని ఉద్యోగులు ఆశగా చూస్తున్న దాని ఊసే లేదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా జగన్మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామంలోని అన్ని రకాల ప్రభుత్వ సేవలను అందించే విధంగా ఉద్యోగులను నియమిస్తే ఇప్పటి కూటమి ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో వారిలో కొంతమందిని తొలగించడం జరుగుతుందన్నారు. ఉద్యోగాన్ని సృష్టించాల్సింది పోయి ఉన్న ఉద్యోగాలని ఏదో ఒక కారణం చెప్పి తగ్గించేయడం లేదా వేరు వేరు శాఖలకు బదిలీ చేయడం జరుగుతుందని విమర్శించారు. ఒక మంచి వ్యవస్థను జగన్మోహన్ రెడ్డి నియమించారని అయితే దాన్ని నాశనం చేసేందుకు కూటమి ప్రభుత్వం సర్వ నాశనం చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థలను కొనసాగించాలని చూడకుండా వాటిని నాశనం చేయడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైసీపీ నాయకుడు శ్యామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.